క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



ఆలయానికి వెళ్తున్న భక్తులు

చీపురుపల్లి: కూరగాయల పంటలను ఆశిస్తూ తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్న నత్తల సంహరణ జరగాలని ఆకాంక్షిస్తూ చీపురుపల్లి ప్రజల ఇలవేల్పు కనకమహాలక్ష్మి అమ్మవారిని కూరగాయల రైతులు వేడుకున్నారు. ఈ మేరకు పట్టణంలోని కూరాకులవీధి, విజయాకాలనీలో ఉన్న కూరాకుల రైతులు అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూరాకుల సామాజికవర్గానికి చెందిన వారంతా పట్టణ శివారున కూరగాయలు పండిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో నత్తలు విపరీతంగా వచ్చి కూరగాయల పంటను పాడు చేస్తున్నాయి. ఆ నత్తల నుంచి పంటలను కాపాడాలని కోరుతూ అమ్మవారికి పూజలు చేశారు.

ప్రమాదకరంగా ఎల్.కోట - ఖాసాపేట రోడ్డు



రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చిమొక్కలు

లక్కవరపుకోట: మండలంలోని ఎల్.కోట నుంచి ఖాసాపేట, తలారి, కొట్యాడ మీదుగా అలమండ సంత జంక్షన్‌కు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. రెండువైపులా తుప్పలు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించడం లేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


అభివృద్ధికి నోచుకోని రోడ్లు..



శృంగవరపుకోట: కొట్టాం రోడ్డు మీదకు వచ్చిన తుప్పలు

శృంగవరపుకోట: రోడ్డుమీద తిరిగే ప్రతి వాహనదారుడి నుంచి రోడ్ ట్యాక్స్ వసూలు చేస్తారు. టోల్‌ప్లాజాలు పెట్టి పైసలు గుంజేస్తారు. కాని వాహన రాకపోకలకు వీలుగా రహదారులను మాత్రం అభివృద్ధి చేయరు. ప్రమాదాల్లో ప్రాణాలు పోయినా కనీసం పట్టించుకోరు. మండలంలోని చాలా రోడ్లకు గ్రావెల్ బెర్ములు వేయలేదు. జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో చాలా రోడ్ల మీదకు తుప్పలు రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. మెయింటినెన్స్ పనులు చేయమంటే అధికారులు నిధుల్లేవంటారు. ముఖ్యంగా ధర్మవరం, కొట్టాం రహదారులు ప్రమాదకరంగా మారాయి.

సైబర్ మోసాలపై అవగాహన



మహిళలు, యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నారాయణరావు

గుర్ల: యువత, ఉద్యోగులు, మహిళలు సైబర్ మోసాల వలలో చిక్కుకుపోతున్నారని ఎస్సై పి.నారాయణరావు అన్నారు. మండలంలోని చింతలపేటలో సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. తెలియని వారికి ఎటువంటి పరిస్థితుల్లో బ్యాంక్ ఖాతా వివరాలు చెప్పకూడదని సూచించారు.

సత్కారం



చర్చి పాస్టర్‌ను సత్కరిస్తున్న రేగాన శ్రీనివాసరావు

గుర్ల: ప్రపంచ సేవకుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కెల్ల చర్చిలో పాస్టర్ బిషప్ పిల్లా స్టీఫెన్ పాల్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న.. బెల్ట్ షాపులు



ఎం.వెంకటాపురంలో వెలిసిన బెల్ట్‌షాపు

- రెచ్చిపోతున్న మద్యం బాబులు
- నాశిరకం మద్యంతో వ్యాపారుల దోపిడీ
- పట్టించుకోని అధికారులు

గజపతినగరం: నియోజకవర్గ వ్యాప్తంగా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. లైసెన్స్‌డ్ దుకాణం ఒకటి ఉంటే పదుల సంఖ్యలో బెల్ట్‌షాపులు పుట్టుకొస్తున్నాయి. దీంతో మద్యం వ్యాపారం మూడు పుళ్లు.. ఆరు హాఫ్‌ల మాదిరిగా సాగుతోంది. పైగా నాణ్యమైన మందు కంటే నాశిరకం మందు విక్రయిస్తూ అటు వ్యాపారులు, ఇటు బెల్ట్ షాపు నిర్వాహకులు మందుబాబులను దోచుకుంటున్నారు. గజపతినగరం నియోజకవర్గంలో గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాల్లో ప్రభుత్వ మద్యం షాపులతో పాటు ఎక్కడికక్కడ విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు వెలిశాయి. అయినప్పటికీ వాటిని నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారనే చెప్పాలి. పాఠశాలలు, దేవాలయాలకు అతి సమీపంలో కూడా మద్యం విక్రయాలు జరుగుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. బెల్ట్‌షాపు యజమానులతో అటు పోలీసులు, ఇటు ఎక్సైజ్ అధికారులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గజపతినగరం మండలం విషయానికొస్తే గజపతినగరం, పురిటిపెంట, దావాలపేట రోడ్డు, ఎం.వెంకటాపురం, బంగారమ్మ పేట, పాత బగ్గాం, ఎం.కొత్తవలస, రంగుపురం, తదితర గ్రామాల్లో బెల్ట్‌షాపులు అధికంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి అరికట్టాలని మండల వాసులు కోరుతున్నారు.



మహంకాళి అమ్మవారి టెంపుల్ సమీపంలోని బెల్ట్‌షాపు

అరికట్టాలి..

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు వెలిశాయి. స్పందించాల్సిన అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. చిన్నారులు, మహిళలు సంచరిస్తున్న ప్రాంతాల్లో సైతం బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడం శోచనీయం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్‌షాపులను నిర్మూలించాలి.

– బి. గౌరినాయుడు, తుమ్మికాపల్లి, గజపతినగరం మండలం

150 మంది నిర్వాహకులపై కేసులు

ఎక్సైజ్ శాఖ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని మండలాల్లో ప్రత్యేక నిఘా సారిస్తున్నాం. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సుమారు 150 మందిని గుర్తించి కేసులు నమోదు చేశాం. అలాగే వారి వద్ద నుంచి 273.5 లీటర్ల మద్యం , 6.5 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నాం.

– జి.జనార్దనరావు, ఎక్సైజ్ సీఐ

మంత్రి ఇలాకాలో ఏరులై పారుతున్న మద్యం

- ఏ గ్రామంలో చూసినా బెల్ట్ షాపులే



బొండపల్లి మండలం నెలివాడలో ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న మద్యం సీసాలు (ఫైల్)

దత్తిరాజేరు: గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్ మంత్రిగా ఉన్నప్పటికీ ఆయన నియోజకవర్గంలోనే మద్యం ఏరులై పారుతోంది. ఏ గ్రామంలో చూసినా విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నెలకొన్నాయి. గజపతినగరం సర్కిల్ పరిధిలో ప్రభుత్వం 19 లైసెన్స్‌డ్ మద్యం షాపులకు అనుమతిస్తే వాటి పరిధిలో వందల సంఖ్యలో బెల్ట్‌షాపులు పుట్టుకొచ్చాయి. కొన్ని గ్రామాల్లో అయితే బెల్ట్‌షాపుల కోసం ఏకంగా వేలంపాటలు నిర్వహిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

గజపతినగరం సర్కిల్ పరిధిలో లైసెన్స్‌డ్ షాపులు	
దత్తిరాజేరు	04
గజపతినగరం	05
గంట్యాడ	06
బొండపల్లి	04

ఎంఆర్‌పీ కంటే అదనం..

లైసెన్స్‌డ్ మద్యం వ్యాపారులే నేరుగా బెల్ట్ షాపులకు తమ సిబ్బంది ద్వారా మద్యం సరఫరా చేస్తున్నారు. అక్కడ బెల్ట్‌షాపుల వారు ఎంఆర్‌పీ కంటే రూ. 50 నుంచి 70 రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తూ నిలువునా దోచేస్తున్నారు. గజపతనగరం నియోజకవరగంలోని నాలుగు మండలాల పరిధిలో 2024 అక్టోబర్ నుంచి 2025 అక్టోబర్ వరకు సుమారు రూ. 180 కోట్లు మద్యం విక్రయాలు జరిగినట్లు అధికారుల అంచనా.

పొంచి ఉన్న ప్రమాదం..



ఎస్.కోట మండలం పెదఖండేపల్లి బీసీ కాలనీలో ఓ విద్యుత్ స్తంభం పక్కనే ఉన్న ఇంటిపైకి ఒరిగిపోయింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పైగా విద్యుత్ స్తంభం కూడా షాక్ కొడుతోంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– శృంగవరపుకోట

భగవద్గీత పుస్తకాల పంపిణీ



శృంగవరపుకోట పట్టణంలోని మోక్ష విద్య యోగ మందిర్ వ్యవస్థాపకుడు శీలా కోటీశ్వరరావు నేతృత్వంలో సభ్యులు ఆదివారం స్థానిక జీసీసీ రోడ్డులో ఇంటింటికీ వెళ్లి భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. భగవద్గీత చదవడం వల్ల జీవితం విలువ తెలుస్తుందని కోటీశ్వరరావు అన్నారు.

– శృంగవరపుకోట

కల్తీ మద్యంపై సీబీఐ విచారణ చేపట్టాలి

- జెడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీష



జెడ్పీటీసీ సభ్యురాలు శిరీష

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం కల్తీ మద్యం అమ్మకాలు సాగిస్తూ ఎంతో మంది పేద ప్రజల ప్రాణాలు బలి తీసుకుంటోందని.. ఈ వ్యవహారంపై సీబీఐచే విచారణ చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీషా డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జెడ్పీటీసీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కల్తీ మద్యం విక్రయాలు జరిపేందుకే కూటమి ప్రభుత్వం మద్యం వ్యాపారాన్ని ప్రైవేట్ పరం చేసిందన్నారు. ప్రభుత్వ లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల ద్వారా కూడా నాసిరకం మద్యం విక్రయించడం సిగ్గుచేటన్నారు. కల్తీ మద్యం అమ్మకాలపై సీబీఐ విచారణ జరిపించాలని పట్టుబట్టారు. ఇలాంటి పరిస్థితులు ఉండకూడదనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గతంలో మద్యం దుకాణాలను ప్రభుత్వం ద్వారా నడిపించారని గుర్తు చేశారు. అయినప్పటికీ గత ప్రభుత్వంలో మద్యం విక్రయాలపై కూటమి ప్రభుత్వం లేనిపోని ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. కల్తీ మద్యం విషయంలో ప్రభుత్వం తీరును నిరసిస్తూ, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రాల్లో సోమవారం నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. నిరసన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రగిలిన యువ చైతన్యం

- ప్లే గ్రౌండ్ అభివృద్ధి కోసం సమావేశమైన యువత
- స్వచ్ఛందంగా అభివృద్ధి చేయాలని తీర్మానం



సమావేశానికి హాజరైన ఎస్.కోట పట్టణ యువత

శృంగవరపుకోట: 'ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా.. నిజం మరిచి నిదురపోకుమా' అంటూ ఓ సినీ కవి చెప్పింది అక్షరాలా నిజం అని గ్రహించారు ఎస్.కోట యువత. పట్టణంలోని కళాశాల మైదానాన్ని మన అవసరాల కోసం, మన భవిష్యత్ కోసం అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా శనివారం స్థానిక వాట్సప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టారు. ఆదివారం ఉదయాన్నే స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సుమారు 100 యువకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ.. ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో క్రీడా మైదానం డంపింగ్‌యార్డులా తయారైందన్నారు. ప్రస్తుతం మందుబాబులకు అడ్డాగా మారిందని అభిప్రాయపడ్డారు. పెద్దలు వాకింగ్ చేసుకోవడానికి, యువత రన్నింగ్‌కు ఉపయోగపడేలా మైదానాన్ని అభివృద్ధి చేసుకోవాలని తీర్మానించారు. ఇందుకోసం అయ్యే ఖర్చును తామంతా భరించటంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని నిర్ణయిచారు. రాజకీయ పార్టీలతో ప్రమేయం లేకుండా 'మన ఎస్.కోట – మన యువత' అన్న నినాదమే లక్ష్యంగా అందరూ కలిసి ఒకే మాటగా నడవాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు యువకులు, విశ్రాంత ఉద్యోగులు, వేదిక అధ్యక్షుడు సూర్యారావు, 'జియో' వ్యవస్థాపకుడు రామకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయుడు వై.వెంకటరావులతో పాటూ కొందరు పెద్దలు హాజరయ్యారు.

నిరసన కార్యక్రమానికి తరలిరావాలి

దత్తిరాజేరు: నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరంలో కల్తీ మద్యంపై సోమవారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆధ్వర్యంలో ఉదయం పది గంటలకు పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేస్తామన్నారు.

గ్రంథాలయంలో సమాచార హక్కు చట్టం దినోత్సవం



మాట్లాడుతున్న సమాచార హక్కు చట్టం జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ మెంబర్ సూర్యారావు

శృంగవర పుకోట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో సమాచార హక్కు చట్టం దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ మెంబర్ డి.సూర్యారావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సుమారు ఐదు వేలకు పైగా ఉన్న చట్టాల్లో సమాచార హక్కు చట్టం ఎంతో గొప్పదన్నారు. ఈ చట్టం వల్ల కోట్ల రూపాయల కుంభకోణాలు వెలుగు చూశాయన్నారు. చట్టం అమలుకు పది మంది కమిషనర్లను నియమించాల్సి ఉన్నా ఇప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి



వైద్యశిబిరంలో పాల్గొన్న అపోలో ఆస్పత్రి వైద్యులు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గొరపల్లి జయప్రకాష్ శివ

కొత్తవలస: ప్రైవేట్ ఆస్పత్రులు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గొరపల్లి జయప్రకాష్ శివ అన్నారు. కొత్తవలసలో విశాఖపట్టణానికి చెందిన అపోలో ఆస్పత్రి వారు ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వం తరఫున వైద్య శిబిరాలు నిర్వహించేవారని.. ఇప్పుడు ఆ అవకాశం లేదన్నారు. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్యసేవలు పొందాలని సూచించారు. అనంతరం వైద్యులు మెంటు హారిక, వై.ద్రాక్షాయణి, తదితరులు 134 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ క్యాంప్ కో ఆర్డినేటర్స్ బి.శ్రీను, బి.శివకుమార్, తదితరలు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



గుర్ల: సమావేశమైన పూర్వ విద్యార్థులు



మెరకముడిదాం: సమావేశమైన పూర్వ విద్యార్థులు

గుర్ల: మండలంలోని కెల్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2007లో చదువుకున్న పూర్వ విద్యార్థులు మండల కేంద్రంలోని బీవీఆర్ లే అవుట్‌లో ఆదివారం గెట్ టుగెదర్ నిర్వహించారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు, ప్రస్తుత గుర్ల, గరివిడి ఎంఈఓలు ఎస్.భానుప్రకాష్, ఎం. రామారావు, తదితరులను ఘనంగా సత్కరించారు. ఇబ్బందుల్లో ఉన్న తోటి విద్యార్థులను ఆదుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కెల్ల సూరినాయుడు, వెలమల శ్రీను, కర్రోతు గోవింద్, కెల్ల గోవింద్, శనపతి అప్పలస్వామి, రేగాన పైడినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గర్భాం జెడ్పీ పాఠశాలలో..

మెరకముడిదాం: వారంతా ఒకే పాఠశాలలో ఐదేళ్లపాటు కలిసి మెలిసి చదువుకున్నారు. ఉన్నత చదువుల కోసం వాళ్లంతా విడిపోయారు. అప్పుడు విడిపోయిన వీరు ఆత్మీయ కలయిక పేరుతో తాజాగా కలుసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గర్భాం జెడ్పీ పాఠశాలలో 1992–93 వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేసి సందడిగా గడిపారు.

కూలేందుకు సిద్ధంగా పోలీస్‌స్టేషన్



కొత్తవలస పోలీస్‌స్టేషన్

కొత్తవలస: మండల కేంద్రంలో గల పోలీస్‌స్టేషన్ భవనం కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. ఈ భవనం ఎప్పటినుంచో శిథిలావస్థకు చేరుకుంది. పైగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. భవనం మొత్తం కారిపోతుండడంతో సిబ్బంది బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. రికార్డులు కూడా తడిసిపోతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు



కొత్తవలస హైస్కూల్ వద్ద గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

కొత్తవలస: మండల కేంద్రంలో వీధి కుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి. ముఖ్యంగా కొత్తవలస – విజయనగరం రోడ్డులో పోలీస్‌స్టేషన్, హైస్కూల్, తదితర ప్రాంతాల్లో కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతూ రోడ్డుపై వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులను వెంబడించి మరీ గాయపరుస్తున్నాయి. గతంలో వీధి కుక్కలకు సంతానోత్పత్తి జరగకుండా శస్త్రచికిత్సలు చేసేవారు. ప్రస్తుతం అటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మార్లాపల్లిలో పిచ్చికుక్క స్వైర విహారం..

లక్కవరపుకోట: మండలంలోని మార్లాపల్లిలో ఆదివారం సాయంత్రం ఓ పిచ్చికుక్క స్వైర విహారం. ఎక్కడ నుంచో వచ్చిందో తెలియదు కాని ఒక్కసారిగా కనబడిన ప్రతి ఒక్కరిపై దాడి చేసింది. ఈ క్రమంలో నలుగురు వ్యక్తులను గాయపరిచింది. వీరిలో నెక్కల దేవుడమ్మ (63) ఇంటి వద్ద ఉండగా ఒక్క సారిగా దాడి చేయడంతో తీవ్ర రక్త స్రావం జరిగింది. వెంటనే ఆమెను ఎల్.కోట పీహెచ్‌సీకి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. అలాగే నాలుగు పశువులను కూడా గాయపరిచింది. దీంతో గ్రామస్తులు పిచ్చికుక్కను వెంబడించి హతమార్చారు.

